

కబ్జాలపై చర్యలు తీసుకుని విచారణ చేపట్టాలి

నిర్మల్ కల్చరల్, ఆగస్టు 27 : హైదరాబాద్ తరహాలో జిల్లాలో హైడ్రా ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ అధ్యక్షుడు బాణావత్ గోవింద్‌నాయక్ ఒక ప్రకటనలో కోరారు. నిర్మల్ పట్టణంలో వందల ఎకరాలు కబ్జాకు గురయ్యాయని తెలిపారు. వ్యాపారస్తులు, రాజకీయ నేతలు బినామీ పేర్లతో ప్రభుత్వ విలువైన భూములు ఆక్రమించుకున్నారని ఆరోపించారు. కబ్జాలకు గురైన భూములపై చర్య తీసుకొని విచారణ జరపాలన్నారు.

దర్జాగా చెరువుల కబ్జా



ఎన్టీఆర్ మార్గ్ సమీపంలో ఉన్న చెరువు కబ్జాకు గురవుతున్న దృశ్యం



జిల్లా కేంద్రం నడి బొడ్డున గల ధర్మసాగర్ చెరువు ఇదే

- ప్రధాన పార్టీల నేతలు..మాజీ ప్రజా ప్రతినిధులే సూత్రధారులు
- కందకాలనూ వదిలిపెట్టని కబ్జాదారులు
- సరిహద్దులు,భూరికార్డుల తారుమారు
- జిల్లా కేంద్రంలో నిబంధనలకు విరుద్ధంగా భారీ ఎత్తున నిర్మాణాలు

నిర్మల్, ఆగస్టు 27 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని చారిత్రక గొలుసు కట్టు చెరువుల పరిధిలోని ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ భూములు గత కొన్ని సంవత్సరాల నుంచి పెద్దఎత్తున ఆక్రమణలకు గురవుతూనే ఉన్నాయి. అప్పట్లో అధికార పార్టీలో హవా కొనసాగించి ప్రస్తుతం పార్టీ మారిన కొంత మంది మాజీ ప్రజాప్రతినిధులు చెరువుభూముల కబ్జాలకు అసలు సూత్రదారులన్నది బహిరంగ రహస్యమే. పట్టణ నడిబొడ్డున ఉన్న ఐదు గొలుసు కట్టు చెరువుల భూములను వీరితో పాటు వీరి అనుచరులు, బంధువులు దర్జాగా కబ్జాలు చేసి ఆ భూముల్లో భారీషాపింగ్ కాంప్లెక్స్‌లు, అపార్ట్‌మెంట్‌లు, అక్రమవెంచర్‌లు ఏర్పాటు చేశారు. గతంలో ఈ ఆక్రమణలపై స్థానికులు ఆందోళనలు చేసినప్పటికీ తమకున్న అధికార బలంతో అధికారులపై ఒత్తిడులు తెచ్చి ఆందోళనలు సద్దుమణిగింపజేశారు. సుమారు పదిహేను ఏళ్ళ క్రితం రోడ్డు పక్కనే నిండు కుండలా నీటితో కనిపించిన చెరువులన్నీ ప్రస్తుతం తమ ఆకారాన్ని కోల్పోయాయి. కొన్ని చెరువుల్లోని సగభాగం వరకు భారీ గా నిర్మాణాలు జరగడం కబ్జాలకు పరాకాష్టగా చెబుతున్నారు. ధర్మాసాగర్ చెరువులో అప్పటి మాజీ ప్రజా ప్రతినిధులు చెరువుభూముల్లో షా పింగ్ కాంప్లెక్స్‌లు నిర్మించడం అలాగే వెంచర్‌లు ఏర్పాటు చేయడం వివాదాస్పదమైంది. దీనిపై అనేక అభ్యంతరాలు వెల్లువెత్తినప్పటికీ అధికారుల అండతో దర్జాగా ఆక్రమణలు కొనసాగాయి. అలాగే కంచరోణి చెరువులోని సగభాగం భూములు ఇప్పటికే ఆక్రమణకు గురై ఆ భూముల్లో రియల్ ఎస్టేట్ వెంచర్‌లు వెలిశాయి. దీంతో పాటు సీతాసాగర్, రాంసాగర్ చెరువు భూములను కూడా కబ్జాదారులు తమ పలుకుబడితో అడ్డగోలుగా ఆక్రమించారు. అధికారులు తూతూమంత్రంగా సర్వేలు జరిపి తాత్కాలిక హద్దులు ఏర్పాటు చేసినప్పటికీ పెద్దగా ఫలితం కనిపించడం లేదు. అధికారుల హడావిడి ముగిసిన తరువాత కొద్దిరోజుల్లోనే మళ్లీ యథావిధిగా ఆక్రమణలు కొనసాగుతుండడం రివాజుగా మారింది. ప్రస్తుతం హైదరాబాద్‌లో కొనసాగుతున్న హైడ్రా ఆపరేషన్ నిర్మల్‌లో కూడా చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. నిర్మల్‌లో హైడ్రా ఏర్పాటుతోనే చెరువు భూముల్లోని ఆక్రమణలు తొలగించే అవకాశం ఉంటుందని అంటున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఈ దిశగా దృష్టి కేంద్రీకరించాలని కోరుతున్నారు.



Md. Mohammed Moinuddin,
Asst. Executive Engineer, I&CAD
Irrigation Sub-Division No.1, Nirmal

Lr. No.AEE/ISDN/NRML/

Sir,

Sub: Minor Irrigation- Illegal filling of morram in the Full Tank Level of Ram sagar Talab/Manjulapur Cheruvu, in Nirmal Town, Nirmal (M) & (Dist) by Sri Mujahid & Sri Chiluka Ramana AMC Chairman, Nirmal both R/o Nirmal Complaint Submission - Reg.

During the regular inspection it is found that Sri. Mujahid & Sri Chiluka Ramana AMC Chairman, Nirmal both residents of Nirmal Town have filled morram in the Full Tank Level of of Ram sagar Talab/Manjulapur Cheruvu near backside of Pabji B/o Temple and converted the filled land into plots. Through the said land are patta lands but no development activities can be carried out in the Full Tank Level of water bodies. Due to the filling in the Full Tank Level the capacity of the tank is reduced and the flooding of the surrounding areas will happen in the rainy season. Therefore, I request the Commissioner, Nirmal Municipality kindly remove the filled morram in order to maintain the capacity of tank.

This is submitted for further necessary action.

Your's Faithfully
Asst. Executive Engineer
Irrigation Sub-Division No.1, Nirmal

చెరువుల కబ్జాపై మున్సిపల్ కమిషనర్‌కు లేఖ పంపిన ఇరిగేషన్ అధికారులు (ఫైల్)

పేరుకు మాత్రమే సర్వేలు

మొదట జిల్లా కేంద్రంలోని కంచరోణి చెరువు, కుర్రాన్నపేట్ చెరువు విస్తీర్ణాన్ని డీజీపీఎస్‌తో సర్వే చేసి హద్దులను నిర్ధారించారు. ఆక్రమణకు గురైన భూములను సైతం గుర్తించి ఈ హద్దుల ఆధారంగా ట్రెంచ్‌లను సైతం ఏర్పాటు చేశారు. రాబోయే రోజుల్లో మిగతా గొలుసుకట్టు చెరువుల విస్తీర్ణాలను కూడా డీజీపీఎస్‌తో సర్వే చేయించి హద్దులను నిర్ధారించడమే కాకుండా కబ్జాకు గురైన భూములను స్వాధీనం చేసుకుంటామని అప్పట్లో ప్రకటించారు. ఈ డీజీపీఎస్ సర్వేను రెవెన్యూ, ఇరిగేషన్, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ అధికారులతో పాటు అప్పటి జిల్లా కలెక్టర్ సంయుక్తంగా చేపట్టారు. అయితే ఈ డీజీపీఎస్ సర్వేను కేవలం రెండు చెరువులకు మాత్రమే పరిమితం చేసి మిగతా పది చెరువుల సర్వే చేపట్టకపోవడం కబ్జాదారులకు ఇప్ప టి వరకు వరంగా మారుతోంది. సాంకేతికంగా చెరువు భూముల హద్దులను గుర్తించక పోవడంతో ఇష్టారాజ్యంగా శిఖం, ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ భూ ముల ఆక్రమణలు కొనసాగుతూనే ఉన్నాయి. ఈ కబ్జాల కారణంగా జిల్లా కేంద్రంలోని గొలుసు కట్టు చెరువుల రూపురేఖలే అదృశ్యం అవుతున్నాయన్న విమర్శలున్నాయి. ఇప్పటికే కంచరోణి చెరువు, కురాన్నపేట్ చెరువు, ఖజానాచెరువు, బంగల్‌పేట్ చెరువు, ధర్మాసాగర్ చెరువు, మంజులాపూర్ రాంసాగర్ చెరువు, సీతాసాగర్, మంజులాపూర్ చెరువు, పల్లె చెరువు భూములను మాత్రం సర్వే చేయకపోవడం కబ్జాదారులకు వరంగా మారింది. మళ్లీ రీసర్వే జరిపి చెరువుభూముల వాస్తవవిస్తీర్ణం నిర్ధారించి ఆ భూములను కబ్జాల నుంచి రక్షించాలని స్థానికులు కోరుతున్నారు.



కబ్జాకు గురవుతున్న మంజులాపూర్ చెరువును పరిశీలిస్తున్న ఇరిగేషన్ అధికారులు (ఫైల్)

హద్దులు చెరిపేసి..

కాగా ప్రస్తుతం అధికారుల వద్ద ఉన్న చెరువు భూముల రికార్డులకు వాస్తవ పరిస్థితులకు భారీ తేడా ఉందంటున్నారు. అడ్డగోలు ఆక్రమణలు, కబ్జాలతో ఈ చెరువు భూముల విస్తీర్ణం 70శాతానికి పైగా కనుమరుగైందని అంటున్నారు. అధికారుల వద్ద ఉన్న రికార్డుల ప్రకారం బంగల్‌పేట్ చెరువు 210.32 ఎకరాలు, ఖజానాచెరువు 98.22 ఎకరాలు, కొత్త చెరువు 33.11 ఎకరాలు, రామ్‌సాగర్ చెరువు 37.23 ఎకరాలు, జాఫూర్ కురాన్నపేట్ చెరువు 76.18 ఎకరాలు, సీతాసాగర్ గొల్లపేట్ చెరువు 48.11 ఎకరాలు, ఇబ్రహీం చెరువు 76.18 ఎకరాలు, కంచరోణి చెరువు 74.19 ఎకరాలు, ధర్మాసాగర్ చెరువు 65.10 ఎకరాలు, మోతితలాబ్ చెరువు 132.06 ఎకరాలు, చిన్న చెరువు మంజులాపూర్ 81.34 ఎకరాల విస్తీర్ణం ఉన్నట్లు అధికారుల వద్ద ఉన్న రికార్డులు స్పష్టం చేస్తున్నాయి. అయితే ఈ విస్తీర్ణం నుంచి గణనీయంగా ఆక్రమణలు జరిగాయన్న ఆరోపణలున్నాయి. రాజకీయ పలుకుబడి గల వ్యక్తులు పాత రికార్డులను తారుమారు చేసి తమకు అనుకూలంగా మార్చుకున్నారన్న ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి.

తాగు, సాగునీటి కోసం

ఇదిలా ఉండగా కాకతీయుల కాలంలో బహుళ ప్రయోజనాల కోసం నిర్మల్ చుట్టూరా 13 గొలుసుకట్టు చెరువులను నిర్మించారు. సాగు, తాగునీరుకే కాకుండా భూగర్భ జలాల పెంపునకు, చేపల పెంపకానికి తోడ్పడే విధంగా ఈ చెరువులను నిర్మించారు. అలాగే పట్టణ సరిహద్దు చుట్టూరా అప్పట్లో శత్రుసైన్యం చొరబడకుకండా కందకాలను సైతం నిర్మించారు. కాలక్రమంగా నిర్మల్ పట్టణ విస్తీర్ణం పెరిగిపోవడంతో ఈ కందకాలు, చెరువులన్నీ పట్టణ నడిమధ్యలోకి చేరుకున్నాయి. దీంతో పెద్ద మనుషుల కళ్లన్నీ ఈ చెరువుల భూములపై పడ్డాయి. ఇంకేముంది క్రమక్రమంగా సమీప భూముల సర్వేనంబర్ల పేరిట రికార్డులను తారుమారు చేసి ఆ చెరువు భూములకు పట్టాలు సృష్టించుకున్నట్లు కూడా ఆరోపణలున్నాయి. ఇప్పటికైనా పాత రికార్డులను వెలికి తీసి వాటి ఆధారంగా రీసర్వే జరిపినట్లయితే మొత్తం భూముల విస్తీర్ణానికి సంబంధించిన వివరాలు అలాగే ఆ భూముల్లో జరిగిన ఆక్రమణల లెక్కలు కూడా వెల్లడవుతున్నాయంటున్నారు.



జిల్లా కేంద్రంలోని చెరువులు, కందకాలు కబ్జాకు గురవడంతో వరదనీటితో ముంపునకు గురైన ప్రధానరోడ్డు

గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి

- జిల్లా ఎస్పీ జానకీ షర్మిల



కుంటాలలో విలేకరులతో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ జానకీ షర్మిల

కుంటాల, ఆగస్టు, 27: గ్రామాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునేందుకు ప్రజలు సహకరించాలని జిల్లా ఎస్పీ జానకీ షర్మిల అన్నారు. మంగళవారం మండల కేంద్రం కుంటాలలో నిర్వహించిన శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల్లో పాల్గొన్న ఆమె అనంతరం విలేకరులతో మాట్లాడుతూ పట్టణాల్లో ప్రతీచోట సీసీ కెమెరాలు ఉన్నందున నేరస్థులు గ్రామీణ ప్రాంతాలలో చైన్ స్నాచింగ్‌కు పాల్పడుతున్నారని. చైన్‌స్నాచింగ్ నివారించాలంటే ప్రతి గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆమె సూచించారు. గ్రామస్థులందరూ సమిష్టి కృషితో పోలీసులకు సహకరించాలన్నారు. పోలీసులు ప్రజల్లో భాగమేనన్నారు. ఒక్క సీసీ కెమెరా 100 మంది పోలీసులతో సమానమని ఆమె పేర్కొన్నారు. కావున మండలంతో పాటు జిల్లాలోని ప్రతి గ్రామంలో ప్రధాన వీధులలో దుకాణ సముదాయాలలో జనావాసాలు సంచరించే ప్రదేశాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. భైంసా అడిషనల్ ఎస్పీ అవినాష్ కుమార్ ఆధ్వర్యంలో ముథోల్ నియోజకవర్గంలోని అన్ని గ్రామాలలో నేరాలను అదుపు చేసేందుకు ప్రత్యేకంగా కృషి చేస్తున్నామన్నారు. శాంతి భద్రతలకు విఘాతం క లిగిస్తే ఎంతటివారైనా ఊపేక్షించబోమన్నారు. రాబోయే రోజుల్లో జరుపుకోబోయే పండుగలను ప్రశాంతంగా జరుపుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో భైంసా రూరల్ సీఐ నైలు, కుంటాల ఎస్సై భాస్కరా చారి, పోలీసులు ఉన్నారు.

పంచాయతీల బకాయి బిల్లుల కోసం మాజీ సర్పంచుల ఆందోళన

- ఫ్లకార్డులతో నిరసన ర్యాలీ
- ఆర్‌డీవో కార్యాలయ ముట్టడి , ధర్నా

భైంసా, ఆగస్టు 27 : పేరుకుపోయిన గ్రామ పంచాయతీల బకాయి బిల్లులు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ డివిజన్ పరిధిలోని మాజీ సర్పంచులు మంగళవారం భైంసాలో చేపట్టిన ఆందోళనలు హోరెత్తాయి. ఉదయం వేళలో డివిజన్ పరిధిలోని ఏడు మండలాల సర్పంచులు ఇక్కడి విశ్రాంతి భవనంలో బేటీ అయ్యారు. అనంతరం ఫ్లకార్డులు చేతపట్టి ప్రధానరోడ్డు మార్గం మీదుగా ఆర్‌డీవో కార్యాలయం వరకు నిరసన ప్రదర్శనలు చేపడుతూ భారీ ర్యాలీ చేపట్టారు. అక్కడకు చేరుకున్న అనంతరం కార్యాలయాన్ని ముట్టడించి ప్రవేశ మార్గం వద్ద భైఠాయించి ధర్నా చేపట్టారు. బకాయి బిల్లులు వెంటనే విడుదల చేయాలంటూ పెద్దపెట్టున నినాదాలు చేపట్టారు. అనంతరం బిల్లుల విడుదల జరుగక తాము ఎదుర్కొంటున్న ఆర్థిక పరమైన సమస్యలను ఆర్‌డీవో కోమల్‌రెడ్డికి ఏకరువు పెట్టారు. సంబంధిత విషయంలో వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో పలువురు మాజీ సర్పంచులు మాట్లాడుతూ గత, ప్రస్తుత ప్రభుత్వాలు గ్రామ పంచాయతీలకు సంబంధించిన బిల్లుల చెల్లింపులు చేపట్టడంలో నిర్లక్ష్యపూరిత ధోరణి విధానాలు అవలంభిస్తున్నాయని ఆరోపించారు. తాము సర్పంచులుగా ఉన్న పదవీకాలంలో ప్రభుత్వం, అధికారుల ఆదేశాలకు అనుగుణంగా ఎలాంటి పనులు చేపట్టాలని ఉత్తర్వులు జారీ చేసిన చేపట్టామన్నారు. తాము అర్థిక సమస్యలతో కొట్టుమిట్లాడుతున్నప్పటికి పెద్దల ఆదేశాలు కాదనలేక, గ్రామ సమస్యలు దూరమవుతాయన్న ఉద్దేశంతో వివిధ పథకాలు,గ్రాంటులకు సంబంధించిన ప్రగతి పనులు నిర్దేశిత కాలంలో పూర్తి చేశామన్నారు. పనులకు సంబంధించిన బిల్లులు త్వరితగతిన విడుదల అవుతాయని అధికారులు పెర్కొన్న దరిమిలా తామందరం అప్పు,సొప్పు చేసి పనులను పూర్తి చేశామని వివరించారు. అయితే రెండున్నర సంవత్సరాల కాలం నుంచి ఎలాంటి బిల్లుల విడుదల జరుగలేదని అవేదన వ్యక్తం చేశారు. పనులు చేపట్టేందుకు తీసుకున్న అప్పుల వడ్డీలు చెల్లించలేక తామందరం అర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నామని వాపోయారు. కొందరు మాజీ సర్పంచుల కుటుంబాల జీవన పరిస్థితులు అగమ్యగోచరంగా మారిపోయాయని పెర్కొన్నారు. బకాయిల బిల్లుల కోసం కార్యాలయాల చుట్టూ చెప్పులు అరిగేలా ప్రదక్షిణలు చేపడుతున్న స్పందన కానరావడం లేదన్నారు. పట్టించుకునే నాథులే కరువయ్యారని తెలిపారు. ప్రభుత్వం, అధికారుల వ్యవహారంతో తమ విసిగివేసారిపోయి రోడ్డెక్కాల్సి వస్తోందని పెర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం మాజీ సర్పంచుల పరిస్థితులను అర్థం చేసుకొని బకాయి బిల్లులను విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. లేని పక్షంలో తాము ఆందోళనలను మరింత తీవ్రతరం చేస్తామని వెల్లడించారు.



భైంసాలో ర్యాలీ నిర్వహిస్తున్న మాజీ సర్పంచులు

మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

- మహిళలకు 100 కోట్ల రుణాల పంపిణీలో టీజీబీ చైర్మన్ వై. శోభ

నిర్మల్ కల్చరల్, ఆగస్టు 27 : మహిళలు పారిశ్రామిక వేత్తలుగా ఎదిగేందుకు అనేక అవకాశాలున్నాయని తెలంగాణ గ్రామీణ బ్యాంక్ ఛైర్మన్ వై.శోభ అన్నారు. మంగళవారం నిర్మల్ ప్రాంతీయ కార్యాలయం ఆధ్వర్యంలో ఐకేపీ సహకారంతో మెగా రుణ వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... తమ బ్యాంక్ ద్వారా మహిళా సంఘాల రుణాలలో ఎలాంటి ఎన్‌పీఏ లేదన్నారు. తెలంగాణ గ్రామీణ బ్యాంక్‌లో 30 శాతం మహిళలు పని చేస్తున్నారని తెలిపారు. 30 శాతం రుణాలు మహిళలకు అందజేశామన్నారు. మహిళలు బ్యాంక్ ద్వారా తీసుకున్న రుణాలతో తమ ఆదాయాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. డీఆర్డీవో విజయలక్ష్మి మాట్లాడుతూ... బ్యాంకర్లతో సత్సంబంధాలు పెంచుకొని మహిళలు మరింత ఎదగాలని ఆకాంక్షించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇంటిగ్రేటెడ్ ఫార్మింగ్ అభివృద్ధి చేసుకోవాలన్నారు. 20 గుంటల భూమి గలవారు చేపల చెరువు ఏర్పాటు చేసుకునేందుకు బ్యాంక్ ద్వారా లబ్ధిపొందాలన్నారు. రీజినల్ మేనేజర్ రామారావు మాట్లాడుతూ... సోషల్ సెక్యూరిటీ స్కీమ్స్ ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలన్నారు. జిల్లాలో 31 శాఖల ద్వారా మహిళలకు తమ బ్యాంక్ రుణాలు అందజేస్తున్నట్లు చెప్పారు. ప్రతీ ఒక్కరు ఆక్వా వ్యాపారం, దేశి పౌల్ట్రీ, డైరీ, మిల్క్ ట్రాకింగ్ పరిశ్రమను కల్తీలేని ఉత్పత్తిపై అవగాహన పొందాలన్నారు. చైర్మన్ శోభ ఐకేపీ మహిళలకు 100 కోట్ల రూపాయల చెక్కు అందజేశారు. జిల్లా శాఖల మేనేజర్లు, ఐకేపీ డీపీఎం జ్ఞానేష్, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

గంజాయి విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్



నిందితుడి వివరాలను వెల్లడిస్తున్న డీఎస్పీ గంగారెడ్డి

నిర్మల్ టౌన్, ఆగస్టు 27 : నిర్మల్‌లో గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు నిర్మల్ డీఎస్పీ గంగారెడ్డి తెలిపారు. మంగళవారం డీఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన తెలిపిన వివరాల ప్రకారం... 26వ తేదీ సోమవారం ముందస్తు సమాచారం ప్రకారం ఎస్సై అశోక్, సిబ్బంది కలిసి నిర్మల్‌లోని బస్టాండ్‌లో షేక్ అమీర్ సోహెల్ అనే వ్యక్తి తన కస్టమర్లకు అమ్ముతున్నాడని తెలుసుకొని సోమవారం సాయంత్రం షక్ అమీర్ సోహెల్‌ను బస్టాండ్ వద్ద పట్టుకొని అతని వద్ద నుండి 180 గ్రాముల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించామన్నారు. జిల్లాలో ఎవరైనా గంజాయి అమ్మితే వెంటనే పోలీసులకు తెలపాలని, వారి పేర్లను మేము గోప్యంగా, రహస్యంగానే ఉంచుతామన్నారు. నిర్మల్ పట్టణ సీఐ ప్రవీణ్‌కుమార్, ఎస్సై, సిబ్బంది పాల్గొన్నారు.

గొలుసు చోరీకి యత్నించిన వ్యక్తి అరెస్ట్

నిర్మల్ కల్చరల్, ఆగస్టు 27 : మహిళ మెడలో నుండి గొలుసు దోచుకోబోయిన చిట్యాల మురళి అనే వ్యక్తిని మంగళవారం అరెస్ట్ చేసినట్లు సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. వివరాలు సీఐ వెల్లడించారు. తోకల లక్ష్మీ అనే మహిళ తన బంధువుల ఇంటి నుంచి గాజులపేట్‌లోని తన నివాసానికి వెళ్తుండగా మురళి అనే వ్యక్తి ఆమెను వెంబడించాడన్నారు. ధర్మసాగర్ చెరువు కట్టపై ఆమెపై దాడి చేసి మెడలో నుండి బంగారు పుస్తెల తాడు లాక్కునే ప్రయత్నం చేశాడన్నారు. వెంటనే ఆ మహిళ అరవడంతో చుట్టు ప్రక్కల వారు వచ్చి మురళిని పట్టుకొని పోలీసులకు అప్పగించారని తెలిపారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు మురళిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.







ఆర్ఎంపీలు అర్హతకు మించి వైద్యం చేయొద్దు

ఆదిలాబాద్ రూరల్, ఆగస్టు 27: ఆర్ఎంపీలు అర్హతకు మించి వైద్యం చేయొద్దని, పరిమితులకు లోబడి ప్రాథమిక వైద్యం అందించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ కృష్ణ అన్నారు. మంగళవారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయ సమావేశ మందిరంలో ఆర్ఎంపీ, పీఎంపీలకు అవగాహన సదస్సు సమావేశం నిర్వహించారు. ఆర్ఎంపీలు ఫస్ట్ ఎయిడ్ కేంద్రమని మాత్రమే బోర్డులు పెట్టుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు డీఎంహెచ్‌వో సాధన, డీఎంవో శ్రీధర్ పాల్గొన్నారు.

గంజాయి సాగు చేస్తే కఠిన చర్యలు

ఇంద్రవెల్లి, ఆగస్టు 27: గంజాయి సాగు చేపడితే కేసులు నమోదు చేయడంతో పాటు కఠిన చర్యలు తీసుకుంటామని ఉట్నూర్ సీఐ మొగిలి హెచ్చరించారు. సోమవారం మండలంలోని తేజాపూర్ గ్రామ పంచాయితీ పరిధిలోని సాలేగూడ గ్రామంలో గంజాయి సాగు చేస్తున్నట్లు గుర్తించామని, నిందితుడిని అదుపులోకి తీసుకుని అరెస్టు చేశామని, గంజాయి మొక్కలను పీకించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎస్సై దుబ్బాక సునీల్, పోలీసు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సర్వే పూర్తి చేసి.. ప్రతిపాదనలు పంపాలని ఎంపీ వినతి

ఆదిలాబాద్ అర్బన్, ఆగస్టు 27: పార్లమెంట్, నియోజకవర్గ పరిధిలో పలు రైల్వే ప్రాజెక్టు పనుల సర్వేను త్వరితగతిన పూర్తి చేసి మంజూరుకు ప్రతిపాదనలు పంపాలని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్‌ని ఎంపీ గోడం నగేష్ మంగళవారం విన్నవించారు. ఇందులో ఆర్మూర్-ఆదిలాబాద్ వయా నిర్మల్ లైన్ (కొత్త), ఆదిలబాద్, గడచందర్ లైన్, ముద్కేడ్-ఆదిలాబాద్, పిప్పల్‌కుటి డబులింగ్, ఆసిఫాబాద్ రోడ్డు, రెబ్బెన గేట్ ఎఫ్1, గంగారావ్ ఆర్‌ఓబీ మంజూరు చేయాలని కోరడం జరిగిందని ఎంపీ తెలిపారు. అలాగే ఆదిలాబాద్‌లో నిలిచి పోయిన పనులు, బాసర స్టేసన్ వద్ద నెలకొన్న సమస్యలు, రైళ్ల పొడగింపు, సర్వే పనులు, 3, 4 నెలలో పూర్తి చేస్తామని హామీ ఇచ్చారని ఎంపీ గోడం నగేష్ ఈ సందర్భంగా పేర్కొన్నారు.

పులి పిల్లలా.. అడవి పిల్లులా?!

● పంట పొలాల్లో సంచరించడంతో భయపడుతున్న రైతు

తలమడుగు, ఆగస్టు 27: మండలంలోని దొర్లి శివారు ప్రాంతంలో వ్యవసాయ పంట పొలాల్లో మంగళవారం కల్లెం తిరుపతిరెడ్డి వ్యవసాయ పంట పొలాల్లో రైతులు వ్యవసాయ పనులు చేస్తుండగా గుట్ట ప్రాంతం నుంచి ఒక్కసారిగా పంట పొలాల్లో పులి ఆకారం కలిగిన పిల్లలు, పంట పొలాలో సంచరించడంతో ఒక్కసారిగా రైతులు భయపడి పరుగులు తీశారు. వెంటనే రైతులు గ్రామస్థులకు, అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వడంతో అటవీ శాఖ అధికారులు, పంట పొలాల పరిశీలించి వాటి అడుగులను పరిశీలించగా అవి అడవి పిల్లలని గుర్తించారు. రైతులెవరూ భయపడవద్దని కోరారు. పులి పిల్లలు, జన సంచార ప్రాంతాల్లో ఉండవని అడవి ప్రాంతాల్లోనే ఉంటాయని అటవీ అధికారులు పేర్కొన్నారు. దీంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి : సీఐ

బోథ్, ఆగస్టు 27: మత్తు పదార్థాలకు దూరంగా ఉండి సైబర్ క్రైమ్‌ల పట్ల అప్రమత్తంగా ఉండాలని బోథ్ సీఐ రమేష్ పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మత్తు పదార్థాలపై అవగాహన సైబర్, క్రైమ్ విషయంలో జాగ్రత్తలపై సీఐ విద్యార్థులకు వివరించారు. మత్తు పదార్థాలను ఎవరైనా వినియోగిస్తే లేకుంటే విక్రయించిన తమకు సమాచారం అందించాలని సూచించారు. సమాచారం అందించిన వారి పేరు గోప్యంగా ఉంటుందని పేర్కొన్నారు. ఇందులో ఎస్సై ప్రవీణ్‌కుమార్‌తో పాటు కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు పాల్గొన్నారు.

వ్యాధుల నిర్ధారణకు ఇంటింటా సర్వే

బోథ్, ఆగస్టు 27: మండలంలో జ్వరాల తీవ్రతపై వైద్య సిబ్బంది అప్రమత్తమయ్యారు. దీనిలో భాగంగా మండలంలోని అన్ని గ్రామాలలో ఇంటింటా తిరుగుతూ జ్వరం బారిన పడిన వారికి మందులను అందివ్వడం జరుగుతుంది. అందులో భాగంగానే మంగళవారం మండలంలోని సాంగ్వి గ్రామంలో వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ రకాల వ్యాధుల బారిన పడ్డ వారికి మందులను అందివ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం చంద్రకళ మాట్లాడుతూ వ్యాధులు ఉంటే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని వారు సూచించారు. ముఖ్యంగా నీరు నిల్వకుండా చూసుకోవాలని దోమల బారి నుంచి కాపాడుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆశా వర్కర్లు, వైద్య సిబ్బంది, తదితరులున్నారు.

హోంగార్డు ఆత్మహత్య

ఆదిలాబాద్ రూరల్, ఆగస్టు 27: అనారోగ్య సమస్యలతో హోంగార్డు బలవన్మరణానికి పాల్పడిన ఘటన ఆదిలాబాద్ టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. దీనికి సంబంధించి పోలీసుల కథనం ప్రకారం.. ఆదిలాబాద్ పట్టణంలోని క్రాంతినగర్‌కు చెందిన చుక్క బట్ల మోహన్(38) కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెంది సోమవారం రాత్రి ఇంటి నుంచి బయటకు వెళ్లి మార్కెట్ యార్డు సమీపంలో ఉన్న హోటల్లో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అయితే మంగళవారం తెల్లవారు జామున గమనించిన స్థానికులు పోలీసులకు వెంటనే సమాచారం అందించారు. దీంతో పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు టూ టౌన్ సీఐ కరుణాకర్ తెలిపారు.

గ్రంథాలయాన్ని సందర్శించిన కలెక్టర్

ఆదిలాబాద్ రూరల్, ఆగస్టు 27: జిల్లాకేంద్రంలోని గ్రంథాలయాన్ని మంగళవారం ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షిషా సందర్శించారు. విభాగాలతో పాటు వష్ రూమ్‌లను తనిఖీ చేశారు. పాఠకులతో కలిసి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ గ్రంథాలయంలో పాఠకులకు అవసరమైన సౌకర్యాలను, భవన మరమ్మతులను చేపడతామన్నారు. ఎక్కువ మంది అభ్యర్థులు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాలని ఆయన ఆకాంక్షించారు. గ్రంథాలయానికి నూతన భవన నిర్మాణానికి సాధ్యమైనంత త్వరగా చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. గ్రంథాలయంలో అన్ని విభాగాలను ఆవరణను పరిశీలించి శుభ్రంగా ఉంచాలని గ్రంథాలయ సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. తక్షణమే చేపట్టాల్సిన కొన్ని అత్యవసర భవన మరమ్మతులను వెంటనే చేపట్టి నివేదిక ఇవ్వాల్సిందిగా కార్యదర్శిని ఆదేశించారు. పాఠకులకు కావాల్సిన అన్ని పత్రికలు, దినపత్రికలను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ఆయన వెంట అధికారులు ఉన్నారు.

గిరిజన విద్యార్థులకు మెరుగైన విద్యనందించండి : పీవో

ఉట్నూర్, ఆగస్టు27: ఆశ్రమ పాఠశాలల విద్యార్థులకు మెరుగైన విద్యనందించాలని ఐటీడీఏ పీవో ఖుష్బుగుప్త ఉపాధ్యాయులను ఆదేశించారు. లక్కెటిపేట్ బాలికల ఆశ్రమ పాఠశాలను పీవో ఆకస్మికంగా సందర్శించారు. విద్యార్థులకు అందిస్తున్న విద్య, వైద్యం, భోజనంపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయుల అటెండెన్స్, స్టాక్ రిజిస్టార్లను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు,ఉపాధ్యాయులు,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సహకార సంఘంలో అక్రమాలపై విచారణ

బోథ్, ఆగస్టు 27: బోథ్ సహకార సంంలో అక్రమాల చిట్టా రోజురోజుకూ బయట పడుతోంది. గతంలో జరిగిన అక్రమాలపై సహకార సంఘం డైరెక్టర్లు పలు ఆరోపణలు చేస్తూ తగు విచారణ చేపట్టాలని జిల్లా సహకార సంఘం అధికారులకు విన్నవించడం జరిగింది. దీంతో మంగళవారం జిల్లా సహకార సంఘం అధికారులైన సీనియర్ ఇన్‌స్పెక్టర్ జిలాలుద్దీన్, సీనియర్ అసిస్టెంట్ సంతోష్‌లు విచారణ చేపట్టారు. మొదట సహకార సంఘానికి సంబంధించిన బ్యాంకునకు వెళ్లి విచారణ చేశారు. నో డ్యూ సర్టిఫికెట్ లేకుండానే ఏవిధంగా రుణాలు ఇచ్చారని సంబంధిత బ్యాంకు మేనేజర్‌ను అధికారులు ప్రశ్నించారు. అయితే ఈ విషయం తమకు తెలియదని, సహకార సంఘం వారికి ఈ విషయం తెలుసునని, తమకు ఎలాంటి సంబంధం లేదని తేల్చి చెప్పారు. అనంతరం సహకార సంఘం కార్యాలయంలో బాధిత రైతు గంగాధర్, భార్య పుష్పను ఈ విషయమై ప్రశ్నించారు. అయితే తమకు బ్యాంకులో అప్పు లేదని తమకు తెలియకుండానే.. రూ.68వేల పైచిలుకు అప్పు ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారని వివరించారు. అయితే అధికారుల నిర్లక్ష్యం వల్ల తాము రుణమాఫీకి దూరం కావడం జరిగిందన్నారు. అయితే వాస్తవానికి తులసీ గంగాధర్ అనే రైతు తీసుకున్న అప్పును తన భర్త తూము గంగాధర్‌పై ఉన్నట్లు పేర్కొన్నారన్నారు. ఆపరేటర్ తప్పిదం వల్ల తమకు అన్యాయం జరిగిందని రైతు కుటుంబీకులు వాపోయారు. అయితే విచారణకు విచ్చిన అధికారులు సహకార సంఘంలో జరుగుతున్న అక్రమాలను చూసి అవాక్కయ్యారు. ఒక రైతుకు ఒకే సర్వే నెంబర్‌పై రెండు బ్యాంకులు రుణం ఎలా ఇస్తారని అధికారులను నిలదీశారు. అప్పటి సీఈవోతో పాటు పాలకవర్గం సంబంధించిన కొంత మంది వ్యక్తుల ప్రమేయంతో ఈ అక్రమాలు చోటు చేసుకున్నాయని అధికారుల దృష్టికి వచ్చింది. జరిగిన అక్రమాలపై జిల్లా కోఆపరేటివ్ అధికారికి వివరిస్తామని, నష్టపోయిన వారు ఆందోళన చెందవద్దని అధికారులు పేర్కొన్నారు.

కాగా, సహకార సంఘంలో జరిగిన అక్రమాల విషయమై తాము జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్తామని సహకార సంఘం డైరెక్టర్లు జి.రాజు యాదవ్, చెట్ల ఉమేష్, ద్యాగల నారాయణలు పేర్కొన్నారు. గతంలో ఒక్కో రైతుకు ఒకే పట్టా పాస్ బుక్ నెంబర్‌పైన రెండు బ్యాంకుల్లో నో డ్యూ సర్టిఫికెట్ చూడకుండానే మామూళ్లు దండుకొని రుణాలు ఇవ్వడం జరిగిందని ఆరోపించారు. ప్రతీ మూడు నెలలకు ఒకసారి జరగాల్సిన సమావేశాలు అప్పటి చైర్మన్ ఏర్పాటు చేయలేదని, ఫలితంగా రైతులు నష్టపోవాల్సి వచ్చిందన్నారు. ఏదిఏమైనాఈ అక్రమాలపై చైర్మన్‌ను బాధ్యులు చేస్తూ విధుల నుంచి తప్పించాలని వారు డిమాండ్ చేశారు.

తీజ్ ఉత్సవం బంజారా సంస్కృతికి ప్రతీక

● బీజేపీ ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు పతంగే బ్రహ్మానంద్

ఇంద్రవెల్లి, ఆగస్టు 27: తీజ్ ఉత్సవాలు బంజారా సంస్కృతి, సంప్రదాయాలకు, పర్యావరణ హిత జీవనానికి ప్రతీకగా నిలుస్తాయని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పతంగే బ్రహ్మానంద్ అన్నారు. మండలంలోని హర్కాపూర్ తండా గ్రామంలో మంగళవారం నిర్వహించిన బంజారా తీజ్ పండుగ ఉత్సవాల్లో పాల్గొని మాట్లాడారు. భిన్నత్వాలకు అలవాలమైన భారత దేశంలో ప్రతిఒక్కరూ వారి పద్దతుల్లో సర్వ మానవాళి శ్రేయస్సు, పర్యావరణహితం కోసం ఉత్సవాలు నిర్వహిస్తారని తెలిపారు. అంతకుముందు బీజేపీ రాష్ట్ర నాయకులు రాథోడ్ నితేష్‌తో కలిసి మండలంలోని అందు


సుంకిడిలో తీజ్ వేడుకల్లో పాల్గొన్న చిన్నారులు, నాయకులు


దేవులనాయక్‌తండాలో ఉత్సవాలకు వెళుతున్న మహిళలు

నాయక్ తండా గ్రామంలో ఇటీవల కవల పిల్లలకు జన్మనిచ్చి తల్లి వాగ్మారే దీక్ష మృతి చెందిన విషయం తెలుసుకుని బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఆయన వెంట పార్టీ మండల అధ్యక్షుడు ఆరెల్లి రాజలింగు, నాయకులు మోరే దిలిప్, మాస్కే రాజవర్ధన్, తదితరులు పాల్గొన్నారు.

● సంప్రదాయబద్ధంగా తీజ్ పండుగ

భోథ్: మండలంలోని దేవులనాయక్ తండా గ్రామంలో మంగళవారం లంబాడాలు సంప్రదాయ తీజ్ ఉత్సవాల్లో పాల్గొన్నారు. గ్రామంలో పెళ్లికి వచ్చిన యువతులు, మహిళలు గోధుమ మొలకలు ఉన్న బుట్టలను తలపై పెట్టుకుని భక్తిశ్రద్ధలతో పాటలు పాడుతూ నృత్యాలు చేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన లంబాడాల ఐక్య వేదిక మండల ఇన్‌చార్జి జాదవ్


హర్కాపూర్ తండా గ్రామంలో బంజారా తీజ్ పండుగ ఉత్సవాల్లో పాల్గొన్న బీజేపీ నాయకులు

కృష్ణ నాయ క్, మాజీ సర్పంచ్ రాథోడ్, ఉప సర్పంచ్ రాథోడ్ ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

సిరికొండ: మండలంలోని సుంకిడి, ధర్మాసాగర్, ఫకీర్‌నాయక్‌తండా, తుమ్మల్‌పాడ్ గ్రామాల్లో తీజ్ ఉత్సవాలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. యువతులు తమకు మంచి వరుడు కావాలని దైవాన్ని కోరుతూ భక్తిశ్రద్ధలతో పండుగను జరుపుకోవడం ఇక్కడ ఆనవాయితీగా వస్తోంది. తీజ్ వేడుకల్లో పెళ్లికానీ గిరిజన యువతులు తొమ్మిది రోజులు అత్యంత నిష్టంగా ఉపవాసాలు చేస్తారు. ఈ పండుగలో భాగంగా తొలుత పుట్టమట్టిని తీసుకొచ్చి, వెదురుబుట్టలో దాన్ని వేసి ఆ బుట్టలో గోధుమ విత్తనాలు చల్లి మొలకలు వచ్చే వరకు నీటిని పోస్తారు. ఇవి ఎంత పచ్చగా ఉంటే భవిష్యత్ అంతా ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో ఉంటుందని వారి ప్రగాఢ నమ్మకం. ఇందులో భాగంగా ఉత్సవాల చివరి రోజైన మంగళవారం మొలకెత్తిన బుట్టలను ప్రత్యేక వస్త్రాధారణతో ఆడిపాడి సమీప వాగులు, చెరువుల్లో నిమజ్జనం చేశారు. అనంతరం తమ వెంట తెచ్చుకున్న ఫలహారాన్ని పంచుకుని తిన్నారు. సోదరులు నీటితో యువతుల పాదాలు కడిగి నమస్కారం చేయడంతో పండుగ ముగిసింది. కార్యక్రమం ఇందులో ఆయా గ్రామాల పెద్దలు, మహిళలు, చిన్నారులు పాల్గొన్నారు.

ప్రాణం తీసిన చేపల వేట!

● నాందేడ్‌కు చెందిన ముగ్గురు అన్నదమ్ముల దుర్మరణం

ఆదిలాబాద్ రూరల్, ఆగస్టు 27: చేపల వేటకు వెళ్లి ముగ్గురు అన్నదమ్ములు చెరువులో గల్లంతై మృతి చెందిన విషాద ఘటన ఆదిలాబాద్ జిల్లాలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లాకు చెందిన అక్షయ్(22), ఆకాష్(25), విజయ్(28) ముగ్గురు సొంత అన్నదమ్ములు, వీరు కూలి పని చేస్తూ జీవనం సాగిస్తున్నారు. కాగా వారం క్రితం తాంసి మండలంలోని బండల్ నాగపూర్ గ్రామంలో అద్దె ఇంట్లో ఉంటూ కూలీ పని చేస్తున్నారు. కాగా మంగళవారం సరదాగా చేపల వేటకోసమని ఆదిలాబాద్ రూరల్ మండలంలోని పొచ్చెర వాగులో చేపలు పట్టేందుకు వెళ్లారు. ఈ క్రమంలో అక్షయ్ చేపలు పడుతున్న క్రమంలో లోతును గమనించక అందులో దిగిపోయడు. అతని రక్షించేందుకు ఆకాష్, విజయ్ ప్రయత్నించే క్రమంలో ముగ్గురు గల్లంత య్యారు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న డీఎస్పీ జీవన్ రెడ్డి, రూరల్ సీఐ ఫణిదర్, ఎస్సై ముహాహిద్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వారి కోసం గజ ఈతగాళ్లతో గాలింపు చర్యలు చేపట్టి, ముగ్గురు యువకుల మృతదేహాన్ని వెలికితీశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.




మృతదేహాలను బయటకు తీస్తున్న గజఈతగాళ్లు

● చుట్టపు చూపున వచ్చి కానరాని లోకాలకు..

తాంసి: తమ బంధువుని కలిసి నాలుగు రోజులు ఉండి సరదాగా గడుపుదామనుకున్నా ఆ కుటుంబంలో విషాదం నెలకొంది. చుట్టపు చూపున చూడటానికి వచ్చిన ఆ యువకులు కానరాని లోకాలకు వెళ్లిన సంఘటన ఇది. ఒకేసారి ముగ్గురు మృతి చెందటంతో గ్రామంలో విషాద చాయలు నెలకొన్నాయి. వివరాలిలా ఉన్నాయి.. మండలంలోని బండలనాగపూర్ గ్రామంలో గత కొన్నేళ్ల నుంచి మహారాష్ట్రకు చెందిన శ్రీనివాస్ అనే వ్యక్తి స్థిరనివాసాన్ని ఏర్పాటు చేసుకున్నారు. ఇక్కడే ఉంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కొద్దిపాటి వ్యవసాయాన్ని సాగు చేస్తూ ఇక్కడే స్థిరంగా ఉంటున్నాడు. అయితే నాందేడ్ జిల్లాకు చెందిన నలుగురు యువకులు చుట్టపు రీతిన శ్రీనివాస్ ఇంటికి ఆదివారం సాయంత్రం వచ్చారు. రెండు రోజులు ఇంటి దగ్గరే ఉన్న వారు మంగళవారం ఉదయం సరదాగా చేపలు పట్టడానికి గ్రామ సమీపంలో ఉన్న పొచ్చెర వాగు వద్దకు వెళ్లారు. నలుగురు ఒకేసారి వాగులోకి దూకి చేపలు పట్టే ప్రయత్నం చేశారు. ఇందులో ముగ్గురు అక్షయ్, విజయ్, ఆకాష్, అందులో మునిగి కానరాకుండా పోయారు. అతి కష్టం మీద అందులో నుంచి చందు అనే వ్యక్తి బయటకు వచ్చాడు. ఇంకా వీరు రావడం లేదని అరుపులు లేకలు వేయడంతో చుట్టూ పక్కల వారు వచ్చిచూడగా.. ఎంత సేపటికీ వారు బయటకు రాలేదు. ఈ విషయాన్ని పోలీసులకు తెలియజేయడంతో అక్కడికి చేరుకుని గల్లంతైన వారి కోసం గాలించారు. మంగళవారం సాయంత్రం 6 గంటల ప్రాంతంలో మూడు మృతదేహాలను బయటకు తీశారు. దీంతో ఇటు బండల నాగపూర్ లోనూ అటు నాందేడ్ జిల్లా కేసర్ ఘాట్‌లోనూ విషాద చాయలు నెలకొన్నాయి. ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృతి చెందడంతో ఆ కుటుంబం వీధిన పడినట్లు అయ్యిందని పలువురు పేర్కొంటున్నారు. ఆ శవాలను చూసిన వారంతా కన్నీరుమున్నీరయ్యారు.

కవల పిల్లలకు జన్మనిచ్చి తల్లి చనిపోవడం బాధాకరం : ఎమ్మెల్యే బొజ్జు

ఇంద్రవెల్లి, ఆగస్టు 27: కవల పిల్లలకు జన్మనిచ్చి తల్లి వాగ్మారే దీక్ష మృతి చెందడం బాధాకరమని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. మంగళవారం మండలంలోని అందునాయక్ తండా గ్రామంలోని బాధిత కుటుంబాన్ని పరామర్శించి, మృతికి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడారు. చిన్నారులను బాలల సంరక్షణ కేంద్రానికి అప్పగించాలని కుటుంబ సభ్యులకు సూచనలను చేశారు. ఈ సందర్భంగా బాలల సంరక్షణ అధికారితో ఫోన్‌లో మాట్లాడి చిన్నారుల స్థితిగతులను వివరించారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముఖడే ఉత్తం, నాయకులు ఎండీ మసూద్, సోమోరే నాగోరావు, తదితరులు పాల్గొన్నారు.

● రాయిసెంటర్ భవన నిర్మాణ పనులకు భూమిపూజ

ఉట్నూర్: మండలంలోని నర్సాపూర్(బి) గ్రామ పంచాయతీ పరిధిలోని పెందూరుగూడ గ్రామంలో రూ.15లక్షల నిధులతో రాయిసెంటర్ భవన నిర్మాణ పనులకు ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ మంగళవారం భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. ఇందులో రాయిసెంటర్ సార్ మేడిలు, పటేళ్లు, మాజీ సర్పంచ్‌లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.

జోగు రామన్న నీ జాతకం బయట పెడతా

● డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి

ఆదిలాబాద్ అర్బన్, ఆగస్టు 27: మాజీ మంత్రి జోగు రామన్న పూర్తి జాతకం తనకు తెలుసని, తనపై లేనిపోని ఆరోపణలు చేయిస్తే నీ జాతకం ఎపిసోడ్ల వారీగా బయట పెడతానని డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి అన్నారు. మంగళవారం కంది శ్రీనివాస్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రుణమాఫీ విషయంలో బీఆర్ఎస్ నేతల వ్యాఖ్యలను ఖండించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని పని చేస్తోందన్నారు. సాంకేతిక లోపాల వల్ల ఇంకా నలభై శాతం రుణమాఫీ జరగలేదని, ఇందు కోసం ఓ ప్రత్యేక సిస్టం కూడా ప్రభుత్వం ఏర్పాటు చేసిందని స్పష్టం చేశారు.

గోవధశాల ఏర్పాటును అడ్డుకున్న గ్రామస్థులు


అధికారులను నిలదీస్తున్న గ్రామస్థులు

సారంగాపూర్, ఆగస్టు 27 : సారంగాపూర్ మండల చించోలి(బి) గ్రామ పరిసరాలలో గోవధశాల ఏర్పాట్లను గ్రామస్థులు అడ్డుకున్నారు. నిర్మల్‌లో నిర్వహిస్తున్న దానిని చించోలి (బి) ఎక్స్ రోడ్ పరిసరాలలో ఏర్పాటుకై స్థల పరిశీలనకు ఆర్డీవో, తహసీల్దార్ తదితర అధికారులు సోమవారం సదరు ప్రాంతానికి వచ్చారు. విషయం తెలుసుకున్న గ్రామస్థులు పెద్ద ఎత్తున తరలివచ్చి అధికారులతో వాగ్వివాదానికి దిగారు. అధికారులు సర్ది చెప్పినప్పటికీ ఆందోళనకారులు శాంతించలేదు. దీంతో రెవెన్యూ అధికారులు వెనుదిరిగారు. ఈ కార్యక్రమంలో జిల్లా రైతు సమన్వయ సమితి మాజీ అధ్యక్షుడు నల్లా వెంకట్రామ్‌రెడ్డి, బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు కరిపే విలాస్, బీజేపీ సీనియర్ నాయకులు నల్లా రాంశంకర్‌రెడ్డి, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.

'ప్రజా భద్రత కోసం పకడ్బందీ చర్యలు తీసుకోండి'

లక్ష్మణచాంద, ఆగస్టు 27 : ప్రజా భద్రత కోసం పకడ్బందీ చర్యలు తీసుకోవాలని సోన్ సీఐ నవీన్‌కుమార్ మంగళవారం అన్నారు. మండల కేంద్రంలోని పోలీసుస్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్‌లో ఉన్న రికార్డులను, కేసులకు సంబంధించిన ఫైల్స్‌ను పరిశీలించారు. గణేష్ ఉత్సవాలలో భద్రతకు సంబంధించి సిబ్బందికి పలు సూచనలు చేశారు.

పాఠశాలకు పూర్వ విద్యార్థుల వితరణ

లక్ష్మణచాంద, ఆగస్టు 27 : జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల 2005-06 సంవత్సర విద్యార్థులు తాము చదివిన పాఠశాల కొరకు మంగళవారం 400ల ప్లేట్స్ విరాళంగా అందించి తమ కృతజ్ఞతను చాటుకున్నారు. పాఠశాల కోసం 25 వేల రూపాయల విలువ చేసే పేట్లను విద్యార్థులకు అందించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రాజు నాయక్, ఉపాధ్యాయులు, పాఠశాల పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండండి

లక్ష్మణచాంద, ఆగస్టు 27 : సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో రాధ రాథోడ్ మంగళవారం ఆదేశించారు. ఎంపీడీవో కార్యాలయంలోని ఎంపీడీవో ఛాంబర్‌లో నిర్వహించిన పంచాయతీ కార్యదర్శుల సమావేశంలో ఆమె మాట్లాడారు. అంతకుముందు కేజీబీవీ పాఠశాలను కూడా సందర్శించారు. కార్యక్రమంలో ప్రత్యేక అధికారిణి నవిత, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

చించోలి(బి)లో ఇంటింటి సర్వే.. వైద్య శిబిరం

సారంగాపూర్, ఆగస్టు 27 : మండలంలో గల చించోలి(బి)లో సారంగాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది మంగళవారం ఇంటింటి సర్వే నిర్వహించారు. ఆరు వైద్య బృందాలు ప్రతి ఇంటికి వెళ్లి జ్వరాలతో పాటు సీజనల్ వ్యాధులపై అడిగి తెలుసుకున్నారు. 43 మందికి జ్వరం నిర్ధారణ పరీక్షలు చేశారు. 35 మందికి రాపిడ్ డయాగ్నొస్టిక్ టెస్టులు చేపట్టి గ్రామ పంచాయతీ కార్యాలయంతో పాటు ఆరోగ్య ఉపకేంద్రంలో డాక్టర్ వేదవ్యాస్ వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. వైద్యాధికారి డాక్టర్ వేదవ్యాస్ ఆధ్వర్యంలో ఆరోగ్య శిబిరాలను నిర్వహించి ప్రధానంగా డెంగ్యూ, మలేరియా జ్వర నిర్ధారణ పరీక్షలకు సంబంధించి ఈ సర్వే నిర్వహించినట్లు ఆయన వెల్లడించారు. కార్యక్రమంలో ఎంపీడీవో లక్ష్మీకాంతరావు, మండల పంచాయతీ అధికారి అజీజ్ ఖాన్, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆరోగ్య పర్యవేక్షణ సిబ్బంది, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

కౌట్ల(బి) మ్యాక్స్ కార్యవర్గం ఏర్పాటు

సారంగాపూర్, ఆగస్టు 27 : కౌట్ల(బి)లో గల మ్యాక్స్ కార్యవర్గాన్ని మంగళవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నాకిరెడ్డి నర్సారెడ్డి, ఉపాధ్యక్షుడిగా భోజారెడ్డి, సెక్రటరీగా ఏ. భూమారెడ్డి, ట్రెజరర్‌గా జి. లక్ష్మారెడ్డిలతో పాటు లత, పి. పోతారెడ్డి, వి. గోవింద్, రెడ్డి, రామ్‌రెడ్డి, ఎల్.రాజ్‌మోహన్ రెడ్డి, ఏ.సత్యపాల్‌రెడ్డిలను డైరెక్టర్లుగా ఎన్నుకున్నారు.

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

● భక్తి, శ్రద్ధలతో ఉట్లు కొట్టి సంబురాలు ● ప్రజల్లో ఐకమత్యం పెంచేందుకే ఇలాంటి కార్యక్రమాలు : జిల్లా ఎస్పీ జానకి షర్మిల


కుంటాలలోఉట్టికొట్టేందుకు సిద్దమవుతున్న యువకులు


ఉట్టికొట్టేందుకు యత్నిస్తున్న విద్యార్థులు

కుంటాల, ఆగస్టు, 27 : మండల కేంద్రం కుంటాలలో మంగళవారం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను ప్రజలు ఘనంగా నిర్వహించారు. స్థానిక ప్రాచీన శ్రీకృష్ణ దేవాలయంలో వారం రోజుల క్రితం ఈ ఉత్స వాలను గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ప్రారంభించారు. ప్రతీరోజు శ్రీకృష్ణ భగవానుడికి ప్రీతిపాత్రమైన నైవేద్యాలు సమర్పిస్తూ అభిషేకం, అర్చన, ప్రత్యేకపూజలు రాత్రివేళల్లో భజన, కోలాటం నిర్వహించిన గ్రామస్థులు ఆఖరి రోజు మంగళవారం శ్రీ కృష్ణుని చిత్రపటానికి ప్రత్యేకపల్లకిలో ఉంచి గ్రామ ప్రధానవీధుల గుండా భాజాభజంత్రీలు, భజనమేళాలతో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని చేపట్టారు. మండలంలోని లింబా (కే) గ్రామానికి చెందిన దేవేందర్ (కంటోన్మెంట్ సూపరింటెండెంట్) ఉత్సవాలకు వచ్చిన ప్రజలకు పులిహోర ప్రసాదాన్ని పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన అల్లాల శ్రీనివాస్ కుటుంబ సభ్యులు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. మండల కేంద్రం కుంటాలతో పాటు పక్క గ్రామాలే కాకుండా పక్క మండలాల నుంచి సైతం భక్తులు అధికసంఖ్యలో ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ప్రజల్లో ఐకమత్యం నెలకొల్పేందుకే..

మండలంలోని ఆయా గ్రామాలలో ప్రజలలో ఐక్యమత్యం నెలకొల్పేందుకే ఇలాంటి కార్యక్రమాలు దోహదపడుతాయని నిర్మల్ జిల్లా ఎస్పీ జానకి షర్మిల అన్నారు. మంగళవారం మండల కేంద్రం కుంటాలలో నిర్వహించిన శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల్లో వారు పాల్గొన్నారు. జిల్లా ఎస్పీ జానకి షర్మిలతో పాటు భైంసా ఏఎస్పీ అవినాష్ కుమార్, సీఐ నైలు, ఎస్సై భాస్కరాచారిలు పాల్గొని ఉత్సవాలను తిలకించారు. ఊరేగింపులో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ జుట్టు అశోక్, మాజీ ఎంపీపీ అప్క గజ్జారాం యాదవ్, పీఏసీఎస్ చైర్మన్ నట్ల గజ్జారాంతో పాటు గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, గ్రామస్థులు, పలువురు నాయకులు ఉన్నారు.

శ్రీనగర్ కాలనీలో..

నిర్మల్ టౌన్, ఆగస్టు 27 : నిర్మల్ పట్టణంలోని శ్రీనగర్ కాలనీలో శ్రీ కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కృష్ణుడు గోపికమ్మ వేషధారణలతో చిన్నారులు ఆకట్టుకున్నారు. ఉట్టిని కొట్టేందుకు యువకులు పోటీపడ్డారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు బొద్దుల భానుచందర్, ప్రధాన కార్యదర్శి రాకేష్‌సింగ్, సాయినాథ్, భూమేష్, రాజు, తిరుపతి, మహిళలు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

లిటిల్ ఫ్లవర్ హైస్కూల్‌లో..

ఖానాపూర్, ఆగస్టు 27 : మండల కేంద్రంలోని లిటిల్ ఫ్లవర్ హైస్కూల్‌లో మంగళవారం కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కృష్ణాష్టమి వేడుకలను పురస్కరించుకొని పలువురు చిన్నారులు శ్రీకృష్ణుడు, బలరాముడుతో పాటు గోపికలు, గోప బాలుర వేషదారణలు వేశారు. పాఠశాల డైరెక్టర్ పడాల ప్రభాకర్, ప్రిన్సిపాల్‌లు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చోరీ కేసును 48 గంటల్లో ఛేదించిన ముథోల్ పోలీసులు

● 7.5 తులాల బంగారం రికవరీ ● నిందితుడి అరెస్టు

ముథోల్, ఆగస్టు 27 : నియోజకవర్గం కేంద్రమైన ముథోల్‌లో గల సాయి మాధవ్‌నగర్‌లో రెండు రోజుల క్రితం జరిగిన దొంగతనం కేసును ముథోల్ పోలీసులు రెండు రోజుల్లో ఛేదించారు. పూర్తి వివరాల్లోకి వెళ్లే ముథోల్‌ని సాయి మాధవ్‌నగర్‌లో నివసిస్తున్న వెంకటేష్ ఇంటికి తాళం వేసి పెళ్లికి కుటుంబ సమేతంగా వెళ్లారు. మరుసటి రోజు ఇంటికి వచ్చి చూడగా ఇంటికి వేరే తాళం వేసి ఉంది. దీంతో అనుమానం రావటంతో ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువాలో ఉన్న 7.5 బంగారు ఆభరణాలను దొంగలు ఎత్తు కెళ్లారు. దీంతో పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అయితే సంఘటన స్థలాన్ని భైంసా అడిషనల్ ఎస్పీ అవినాష్‌కుమార్ పరిశీలించి 48 గంటల్లో కేసును ఛేదిస్తామని కుటుంబ సభ్యులు, మీడియాకు తెలిపారు. దీంతో ఎస్సై సాయికిరణ్ కేసుపై పూర్తి విచారణ జరిపారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను అడిషనల్ ఎస్పీ అవినాష్‌కుమార్ మంగళవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి దొంగతనానికి సంబంధించిన వివరాలను విలేకరులకు వెల్లడించారు. చోరీకి గురైన 7.5 తులాల బంగారాన్ని నిందితుల నుండి రికవరీ చేసినట్లు అడిషనల్ ఎస్పీ చెప్పారు. అయితే ఈ కేసులో ప్రాథమికంగా చోరీ అయిన ఇంట్లో అద్దెకు ఉంటున్నవారే ఈ దొంగతనానికి పాల్పడినట్లు నిర్ధారణ అయిందన్నారు. అయితే నిందితులపై పూర్తి విచారణ చేపడుతున్న దృశ్యం మరిన్ని వివరాలు విచారణ తర్వాత నిందితుల వివరాలు ప్రకటిస్తామన్నారు. నిందితులకు ఇంకేమైనా కేసులో ప్రమేయం ఉందన్న కోణంలో విచారణ జరుగుతున్నట్లు తెలిపారు. ఈ కేసును ఛేదించిన ఎస్సై సాయికిరణ్, డబ్ల్యూపీసీ రాజమణిని అభినందించారు. వీరికి రివార్డు ఇవ్వనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఇంట్లో అద్దెకు ఉంటున్న వారి వివరాలు తెలుసుకున్న తర్వాతనే ఇంటి యజమానులు గదులు అద్దెకు ఇవ్వాలని సూచించారు. ఈ సమావేశంలో ఎస్సై సాయి కిరణ్, ఏఎస్సై గంగారాం, హెడ్ కానిస్టేబుల్ రాజారాం, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రణాళికతో పరీక్షలకు సిద్ధమవుతే సత్ఫలితాలు

భైంసా, ఆగస్టు 27 : సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ ప్రణాళికబద్ధంగా చదువుకుంటూ పరీక్షలకు సిద్ధమవుతే సత్ఫలితాలు సాధ్యమవుతాయని ప్రముఖ విద్యావేత్త ప్రసన్న హరికృష్ణ అన్నారు. మంగళవారం భైంసాలో విన్నర్స్ పబ్లికేషన్స్ ఆధ్వర్యంలో జరిగిన పోటీ పరీక్షలపై ఉచిత అవగాహన సదస్సులో పాల్గొని మాట్లాడారు. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థులు భయాందోళనలను విడనాడలన్నారు. సదస్సులో తెలంగాణ గజిటెడ్ లెక్చరర్స్ నిర్మల్ జిల్లా అధ్యక్షులు కార్గాం వినోద్‌కుమార్, వేదం విద్యాసంస్థల అధినేత శ్రీనివాస్‌రెడ్డి, ఆనందిత ఫౌండేషన్ చైర్మెన్ వాడేకర్ లక్ష్మణ్, ఎస్టీయూ రాష్ట్ర ప్రతినిధి నాగభూషణ్‌తో పాటు డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాలకు చెందిన విద్యార్థులు, పోటీ పరీక్షల అభ్యర్థులు పాల్గొన్నారు.

బాసర ఆలయంలో విద్యార్థుల సామూహిక పూజలు



బాసర, ఆగస్టు, 27: శ్రావణమాసం పురస్కరించుకొని బాసర శ్రీ జ్ఞాన సరస్వతీ అమ్మవారి ఆలయంలో మంగళవారం విద్యార్థులకు ప్రత్యేకపూజలు జరిపించారు. విద్యాలక్ష్మీ పేరిట హాజరైన విద్యార్థులందరికీ పూజలు నిర్వహించేలా అధికారులు ఏర్పాట్లు చేశారు. స్థానిక ప్రభుత్వ ప్రైవేటు పాఠశాల విద్యార్థులతో పాటు ఇతర ప్రాంతాల విద్యార్థులు పాల్గొన్నారు. దేవస్థాన వారే పూజా సామాగ్రి అందించి ఉచితంగా పూజలు జరిపించారు.

సమస్యలను పరిష్కరించాలని ఆర్‌టీసీ ఉద్యోగుల నిరసన



భైంసా, ఆగస్టు 27 : సుదీర్ఘ కాలంగా పెండింగ్‌లోనున్న తమ సమస్యలను సత్వరమే పరిష్కరించాలనే డిమాండ్‌తో ఆర్‌టీసీ ఉద్యోగులు మంగళవారం నిరసనలు చేపట్టారు. టీజీఎస్ ఆర్‌టీసీ రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు భైంసా డిపో ఆర్‌టీసీ ఉద్యోగులు డిపో ఎదుట నిరసన ప్రదర్శనలు చేపట్టారు. నల్ల బ్యాడ్జీలు ధరించిన సంస్థ ఉద్యోగులు తమ సమస్యలను పరిష్కరించాలంటూ నినాదాలు చేపట్టారు. అనంతరం నల్ల బ్యాడ్జీలతోనే విధులకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో టీజీఎస్ అర్‌టీసీ భైంసా జేఏసీ ప్రతినిధులు మాట్లాడుతూ కాలయాపను తావులేకుండా తాము ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అర్‌టీసీని ప్రభుత్వంలో విలీనం చేపట్టి సంపూర్ణ ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా వేతన సవరణ చేయాలన్నారు. 2013, 2017 వేతన సవరణ బకాయిలు చెల్లిస్తూ 2021 వేతన సవరణ చేపట్టాలన్నారు. కొత్త బస్సులు కొనుగోలు చేయాలని, ఎలక్ట్రికల్ బస్సులను ఆర్‌టీసీకే ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రాష్ట్ర జేఏసీ ఆధ్వర్యంలో దశలవారీగా ఆందోళనలను తీవ్రతరం చేస్తామని వెల్లడించారు.

నిర్మల్ డిపో ఎదుట

నిర్మల్ కల్చరల్, ఆగస్టు 27 : నిర్మల్ డిపో ఎదుట ఆర్టీసీ ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీ నెరవేర్చాలని డిమాండ్ చేశారు. నాయకులు పాల్గొన్నారు.

హైడ్రాను ముథోల్ నియోజకవర్గంలో అమలుపరచాలి

● సోషల్ జస్టిస్ ఫర్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ డిమాండ్

భైంసా, ఆగస్టు 27 : రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో చెరువుల అక్రమణలు, భూకబ్జాలను తొలగించేందుకు గాను హైడ్రా ఆధ్వర్యంలో కొనసాగుతున్న చర్యలను ముథోల్ నియోజక వర్గ పరిధిలోనూ అమలుపరచాలని సోషల్ జస్టిస్ ఫర్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ డిమాండ్ చేసింది. ఈ మేరకు కౌన్సిల్ జిల్లా డైరెక్టర్ దత్తుసింగ్, ముథోల్ నియోజకవర్గ డైరెక్టర్ డా.సాప పండరి ఆధ్వర్యంలో సోషల్ జస్టిస్ ఫర్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ప్రతినిధులు భైంసాలో అర్‌డీవో కోమల్ రెడ్డికి వినతి పత్రం అందచేశారు. ఈ సందర్భంగా సోషల్ జస్టిస్ ఫర్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ప్రతినిధులు మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలో సైతం హైడ్రా ద్వారా చెరువులు, ప్రభుత్వ భూముల కబ్జాలను గుర్తించే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. భైంసా డివిజన్ పరిధిలోని ఆయా మండలాల సోషల్ జస్టిస్ ఫర్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ప్రతినిధులు వాల్కోడ్ పెంటాజీ, సూర్యవంశి సాయి, జొగదాండే వికాస్, గాంధారి సాయినాథ్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

జీతాలు రాక పారిశుద్ధ్య పనులు నిలిపివేత

ముథోల్, ఆగస్టు 27 : మండలంలోని ఎడ్‌బిడ్ గ్రామంలో పారిశుద్ధ్య కార్మికులకు జీతాలు రాకపోవడంతో పారిశుద్ధ్య పనులు బంద్ చేశారు. మంగళవారం పంచాయతీ కార్యదర్శి శివారెడ్డికి కార్మికులు వినతి పత్రం అందజేశారు.



● రిమ్స్ ఆసుపత్రిలో భద్రత చర్యలను పరిశీలిస్తున్న డీఎస్పీ జీవన్‌రెడ్డి, పోలీసులు →



● రిమ్స్ ప్రధాన గేటు వద్ద కనిపిస్తున్న రద్దీ



● పట్టణంలోని భుక్తాపూర్ కాలనీలో పశువైద్యశాలలో కొనసాగుతున్న ఐటీ కంపెనీ ప్రధానగేటు

కొరవడిన.. భద్రత



- జిల్లాలో రోజురోజుకూ పెరుగుతున్న మహిళా వేధింపు కేసులు
- కఠినంగా చట్టాలను అమలు చేస్తున్నా.. ఆగని అఘాయిత్యాలు
- రిమ్స్ ఆసుపత్రి, ఐటీ కంపెనీల వద్ద కరువైన నిఘా
- భయంభయంగానే విధులు నిర్వహిస్తున్న మహిళా ఉద్యోగులు
- కోల్‌కత ఘటనతో అప్రమత్తమైన జిల్లా పోలీసు యంత్రాంగం
- జిల్లావ్యాప్తంగా ఇప్పటి వరకు అధికారిక లెక్కల ప్రకారం 160 వరకు కేసుల నమోదు

ఆదిలాబాద్, ఆగస్టు 27(ఆంధ్రజ్యోతి): జిల్లాలో మహిళలపై పెరుగుతున్న వేధింపులతో తల్లిదండ్రుల్లో ఆందోళన కనిపిస్తోంది. బయటకు వెళ్తే.. తిరిగి వచ్చేంత వరకు వేచి చూడాల్సిన పరిస్థితులు ఎదురవుతున్నాయి. మహిళలు అన్నిరంగాల్లో రాణిస్తున్నా.. సరైన భద్రత లేకపోవడంతో ఇంటికే పరిమితమవుతున్నారు. ఇప్పటికీ చాలా మంది గ్రామీణ ప్రాంతాలకు చెందిన యువతులు, విద్యార్థినులు పట్టణ ప్రాంతాలకు వెళ్లి చదువుకునేందుకు వెనుకాడుతున్నారు. తల్లిదండ్రుల ముందుచూపు, ఆంక్షలతో ఉన్నత చదువులకు దూరమవుతున్నారు. అసలే పరిస్థితులు బాగాలేవంటూ మూడు ముళ్లు వేయించి అత్తారింటికి పంపించేస్తున్నారు. పెళ్లి చేసి తల్లిదండ్రులు బాధ్యతను తీర్చుకుంటున్నారు. ఇటీవల కోల్‌కతలో జరిగిన వైద్యురాలి హత్యాచార ఘటన దేశవ్యాప్తంగా కలకలం రేపింది. దీంతో జిల్లావ్యాప్తంగా ఆందోళనలు, నిరసనలు వెల్లువెత్తాయి. అయితే జిల్లాలోనూ మహిళలపై వేధింపుల కేసులు పెరిగిపోవడం ఆందోళన రేపుతోంది. కోల్‌కత ఘటనతో జిల్లా పోలీసు యంత్రాంగం అప్రమత్తమవుతోంది. సోమవారం ఆదిలాబాద్ డీఎస్పీ జీవన్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు రిమ్స్ ఆసుపత్రిలో భద్రత చర్యలపై ప్రత్యేకదృష్టి సారించారు. గతంలో రిమ్స్ ఆసుపత్రిలో మహిళలను వేధింపులకు గురి చేసిన దాఖలాలు ఉన్నాయి. కొందరు ఆకతాయిలు, కామాంధులు మహిళలను తరచూ వేధింపులకు గురి చేయడం, అసభ్యంగా ప్రవర్తించడం లాంటి ఘటనలు జిల్లాలో నిత్యం ఎక్కడో ఓ చోట జరుగుతూనే ఉన్నాయి.

వేధింపులతో సతమతం

మహిళలపై ఇంటా బయట వేధింపులు జరుగుతూనే ఉన్నాయి. బయటకు చెప్పుకోలేక లోలోన సతమతమవుతున్నారు. అత్తారింటి వేధింపులను తాళలేక మహిళలు ఆత్మహత్యలు చేసుకుంటూ ఉసురు తీసుకుంటున్నారు. అలాగే పని ప్రదేశంలోనూ, చదువుకునే విద్య సంస్థల్లోనూ వేధింపులు తప్పడం లేదు. ప్రేమపేరిట వేధింపులకు గురిచేయడంతో ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. పరువు ప్రతిష్ఠలకు పోతున్న తల్లిదండ్రులు బయటకు చెప్పుకోలేక పెద్దల సమక్షంలోనే రాజీ కుదుర్చుకుంటున్నారు. కొన్ని సంఘటనలు మాత్రమే వెలుగు చూస్తున్నా.. చాలా సందర్భాలో బయటకు చెప్పుకోలేక పోతున్నారు. గడిచిన 8 మాసాల్లోనే జిల్లాలో 123 గృహహింస కేసులు, 3 అత్యాచారం, అక్రమ రవాణా కేసులు, మరో 18 ఫోక్స్ కేసులు, 20 మిస్సింగ్, కిడ్నాప్ కేసులు, 8 ప్రేమ పేరిట మోసం చేసిన కేసులు, 3 వరకట్న వేధింపు కేసులు నమోదు కావడం ఆందోళనకు దారి తీస్తోంది. జిల్లావ్యాప్తంగా 160 వరకు కేసులు నమోదైనట్లు అధికారిక లెక్కల ప్రకారం తెలుస్తుంది. ఇందులో మూడు, నాలుగు కేసుల్లో మాత్రమే నిందితులకు శిక్షను విధిస్తూ కోర్టు తీర్పును వెల్లడించింది. ఇంకా చాలా కేసులు పెండింగ్‌లోనే కనిపిస్తున్నాయి. అయితే ఎక్కువగా పెద్ద మనుషుల సమక్షంలోనే రాజీ ఒప్పందాలు చేసుకుంటున్నారు. దీంతో పోలీసు స్టేషన్ వరకు ఫిర్యాదులు రావడం లేదంటున్నారు.

ఐటీ కంపెనీల వద్ద నిఘా ఏది?!

జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆసుపత్రితో పాటు ఐటీ కంపెనీల వద్ద నిఘా కొరవడిందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. రిమ్స్ ఆసుపత్రి పరిసర ప్రాంతాలు నిత్యం రద్దీగా ఉంటాయి. ఆసుపత్రికి వచ్చిపోయే మహిళలతో పాటు వైద్య విద్యార్థులు, మహిళా సిబ్బందికి రక్షణ కల్పించాల్సిన అవసరం ఉంది. అయితే రిమ్స్‌లో చాలాచోట్ల సీసీ కెమెరాల పనితీరుపై పర్యవేక్షణ కరువైందన్న వాదనలు వినిపిస్తున్నాయి. ఇటీవల పోలీసుల పర్యవేక్షణలో చాలా లోపాలు బయటపడినట్లు తెలుస్తుంది. మరింత పటిష్ఠమైన భద్రత చర్యలు చేపడితేనే మహిళలకు భరోసా ఉంటుంది. అలాగే జిల్లాకేంద్రంలోని భుక్తాపూర్ కాలనీలో నేషనల్ హైవేకు ఆనుకొని పశువైద్యశాలలో ఏర్పాటు చేసిన ఐటీ కంపెనీ వద్ద నిఘా కరువైందంటూ ఫిర్యాదులు వస్తున్నాయి. ఈ కంపెనీలో రాత్రి 9, 10 గంటల వరకు మహిళ ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు. అయితే ప్రధాన గేటు వద్ద రాత్రి వేళల్లో మందుబాబులు, ఆకతాయిలు అడ్డగోలు వ్యవహారాలకు పాల్పడుతున్నారు. దీంతో మహిళ ఉద్యోగులు కుటుంబ సభ్యుల సహకారంతో ఇంటికి చేరుకునే పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ఒంటరిగా బయటకు వెళ్లే పరిస్థితులు లేవు. కనీసం విద్యుత్ దీపాలను కూడా ఏర్పాటు చేయక పోవడంతో పరిసర ప్రాంతాలు నిర్మానుష్యంగా మారి కనిపిస్తున్నాయి. అలాగే మావల గ్రామంలో ఉన్న మరో ఐటీ కంపెనీ వద్ద కనీస భద్రతా చర్యలు లేవని చెబుతున్నారు. ఐటీ కంపెనీ నుంచి బయటకు అడుగు పెట్టే వీలు లేకుండా పోయింది. రోడ్డు పైననే వాహనాలను పార్కింగ్ చేసుకునే పరిస్థితి ఏర్పడుతుంది. రాత్రి వేళల్లో రహదారి వెంట మహిళ ఉద్యోగులు భయంభయంగానే ఇంటికి చేరుకోవాల్సిన పరిస్థితులు ఉన్నాయి. మావల నుంచి జిల్లాకేంద్రం వరకు రహదారి వెంట విద్యుత్ దీపాలను ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.





● మావలలో జాతీయ రహదారిని ఆనుకొని ఉన్న ఐటీ కంపెనీ

ఏజెన్సీ బంద్ ప్రశాంతం

● ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో ధర్నాలు, రాస్తారోకోలు



ఆదిలాబాద్‌లోని ఆర్టీసీ బస్టాండ్ ముందు ధర్నా చేస్తున్నఆదివాసీలు



ఉట్నూర్‌లో ఐటీడీఏ పీవోకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు



ఇంద్రవెల్లిలో ఎమ్మెల్యే బొజ్జుకు వినతిపత్రాన్ని అందజేస్తున్నారిలా..



ఇచ్చోడలో మూసిఉన్న వాణిజ్య, వ్యాపార సంస్థలు

ఆదిలాబాద్, ఆగస్టు 27(ఆంధ్రజ్యోతి): ఏజెన్సీ ప్రాంతంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలంటూ చేపట్టిన ఆదిలాబాద్ ఏజెన్సీ బంద్ మంగళవారం ప్రశాంతంగా ముగిసింది. జిల్లాకేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ గేటు వద్ద ఆదివాసీ సంఘాల నేతలు బైఠాయించడంతో ఉదయం బస్సులు కొంత ఆలస్యంగా బయలుదేరాయి. అలాగే ఉట్నూర్, ఇంద్రవెల్లి, నార్నూర్, ఇచ్చోడ, బజార్‌హత్నూర్, సిరికొండ ఏజెన్సీ మండలాల్లో బంద్ సంపూర్ణంగా కని పించింది. ప్రభుత్వం వెంటనే ఏజెన్సీ ప్రత్యేక డీఎస్సీతో పాటు జీవో నెం.3 పునరుద్ధరణ, ఎస్టీ జాబితా నుంచి వలస లంబాడాలను తొలగించాలంటూ ఆదివాసీలు ప్రధానంగా డిమాండ్ చేస్తున్నారు. తుడుందెబ్బ ఆధ్వర్యంలోచేపట్టిన బంద్‌కు 9 ఆదివాసీ తెగలు మద్దతునిచ్చాయి. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు ఏజెన్సీలో గట్టిబందోబస్తును చేపట్టారు. పలు చోట్ల ఆందోళనలు, ర్యాలీలు నిరసనలను చేపట్టారు. వ్యాపారులు స్వచ్ఛందంగా దుకాణాలను మూసి వేసి ఏజెన్సీ బంద్‌కు మద్దతునిచ్చారు. ఏజెన్సీ ప్రాంతంలోని మండలాల్లో వ్యాపార లావాదేవీలు పూర్తిగా నిలిచిపోయాయి.

● ఉట్నూర్‌లో ఐటీడీఏ వరకు ర్యాలీ

ఉట్నూర్: తుడుందెబ్బ పిలుపు మేరకు ఏజెన్సీలో బంద్ ప్రశాంతంగా జరిగింది. కాగా, మండలంలోని లింగోజితండా ఎక్స్‌రోడ్డు వద్ద ఉమ్మడి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఆదివాసీలతో కలిసి గిరిజనులు ధర్నా నిర్వహిం చారు. అక్కడి నుంచి ఉట్నూర్‌లోని ఎన్టీఆర్ చౌరస్తాకు ద్విచక్ర వాహనాలతో చేరుకొని పాదయాత్రగా ర్యాలీ తీసి ఐటీడీఏకు చేరు కున్నారు. ఐటీడీఏ కార్యాలయం ఎదుట మంచిర్యాల ఉట్నూర్ రహదారిపై కూర్చుని ఆదివాసీ సంఘాల నాయకులు మాట్లాడారు. ఐటీడీఏ పీవో రావాలంటూ డిమాండ్ చేయడంతో పోలీసు అధికారుల కోరిక మేరకు పీవో వచ్చి గిరిజనుల సమస్యలపై వినతిపత్రం తీసుకున్నారు. ఇందులో తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు పురుక బాపురావు, మాజీ ఎంపీపీ పంద్ర జైవంత్‌రావు, సిడం సోనేరావు, ఆడ హనుమంతరావు, తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీల గళాన్ని అసెంబ్లీలో వినిపించాలి

ఇంద్రవెల్లి: ఏజెన్సీలో ఆదివాసీ గిరిజనుల సమస్యలపై గిరిజనుల తరఫున గళాన్ని అసెంబ్లీలో వినిపించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ఏజెన్సీ బంద్‌లో భాగంగా మండల పర్యటనకు వస్తున్న ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్‌ను స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద ఆదివాసీల సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని ఎమ్మెల్యేకు అందజేశారు. కాగా, ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుం దెబ్బ ఆధ్వర్యంలో నిర్వహించిన ఏజెన్సీ బంద్ మంగళవారం మండలంలో ప్రశాంతంగా ముగిసింది. ఇందులో తుడుందెబ్బ జిల్లా ఉపాధ్యక్షులు గేడం భారత్, మండల అధ్యక్షుడు పూర్క చిత్రు, నాయకులు కోట్నాక్ బారిక్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చోడ: ఏజెన్సీ ప్రాంతమైన ఇచ్చోడ మండల వ్యాప్తంగా మంగళవారం వాణిజ్య వ్యాపారసంస్థలు బందు పాటించాయి. తుడుందెబ్బ పిలుపు మేరకు మండలవ్యాప్తంగా బంద్ ప్రశాంతంగా కొనసాగింది. ఇందులో తుడుం దెబ్బ జిల్లా, నియోజకవర్గ, మండల నాయకులు పాల్గొన్నారు.

నార్నూర్: తుడుందెబ్బ రాష్ట్ర కమిటీ అనుబంధ సంఘాలు ఏజెన్సీ బంద్ పిలుపు మేరకు నార్నూర్, గాదిగూడ మండలాల్లో బంద్ ప్రశాంతంగా జరిగింది. నార్నూర్ మండలకేంద్రం స్థానిక గాంధీచౌక్, గాదిగూడ మండలం లోకారి కుంరంభీమ్‌చౌక్ దగ్గర ఆదివాసీ సంఘాల నాయకులు ధర్నా చేశారు. ఇందులో ఆదివాసీ సంఘ నాయకులు రూప్‌దేవ్, కనక ప్రభాకర్ మాణిక్‌రావు, మడావి ఆనందరావు, దీపక్‌పెందూర్ పాల్గొన్నారు. అలాగే, . గాదిగూడ మండలం లోకారి గ్రామంలో బంద్ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ సోమురాయిసెంటర్ గిత్తేదార్ కొడప జాకు, ఉపసార్‌మేడి పూసం బాజీరావు, మాజీ సర్పంచ్ మేస్రం దేవరావు, ఎంపీటీసీ సిడం నాగరావు, మోతిరాంపటేల్, సిడాం అంబు, తదితరులు పాల్గొన్నారు.

సిరికొండ: ఆదివాసీల హక్కుల సాధన కోసం నేడు సిరికొండలో ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో బంద్‌ను చేపట్టినట్లు తెలిపారు. ఇందు కోసం వ్యాపారస్తులు, ప్రజలు సహకరించాలని పలు ఆదివాసీ సంఘాల నాయకులు కోరారు. ఇందులో కుమ్ర రఘురాం, పెందూర్ అమృత్‌రావ్, పెందూర్ అనిల్‌కుమార్, గుణవంత్‌రావ్, భగవంత్‌రావ్, లస్మన్న, అమృత్, భీంరావ్, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

తలమడుగు: దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న ఆదివాసీ గిరిజనుల సమస్యలు పరిష్కరించాలని తుడుం దెబ్బ రాష్ట్ర పిలుపు మేరకు మంగళవారం నిర్వహించిన ఏజెన్సీ బంద్‌లో భాగంగా మండలంలో బంద్‌ను విజయవంతం చేశారు. ఈ సందర్భంగా తుడుందెబ్బ ఆధ్వర్యంలో ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలను బంద్ చేయించారు. ఇందులో తుడుందెబ్బ డివిజన్ అధ్యక్షుడు జ్ఞానేశ్వర్, మండల అధ్యక్షుడు జంగాల పోచన్న, మాజీ అధ్యక్షుడు భుజంగరావు, కృష్ణ పటేల్, తదితరులు పాల్గొన్నారు.



బంద్‌తో నార్నూర్‌లో నిర్మానుష్యంగా ఓ ప్రధాన వీధి



సిరికొండలో బంద్ ప్రకటిస్తున్న ఆదివాసీ నాయకులు



తలమడుగులో మాట్లాడుతున్న తుడుందెబ్బ నాయకులు

మత్తు పదార్థాల నిర్మూలనకు కృషి చేయాలి

● అధికారులతో సమావేశంలో కలెక్టర్ రాజార్షిషా

ఆదిలాబాద్ అర్బన్, ఆగస్టు 27: జిల్లాలో పూర్తిగా మత్తు పదార్థాలను నిర్మూలించేందుకు అధికారులు కృషి చేయాలని కలెక్టర్ రాజర్షిసా అన్నారు. మంగళవారం జిల్లాకేంద్రంలోని కలెక్టరేట్‌లో గల తన చాంబర్‌లో ఎక్సైజ్, రెవెన్యూ, అగ్రికల్చరల్, పోలీసు, వివిధ శఖల అధికారులతో మత్తు పదార్థాల నివారణ, రవాణాపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మత్తు పదార్థాలు సేకరిస్తున్న వారిని యూనిన్ టెస్టు (టీజీఏఎన్‌బీ) ద్వారా గుర్తించడం జరుగుతుందన్నారు. సమాచారం అందించేందుకు టోల్ ఫ్రీ నెం.1908కు తెలపాలని, గంజాయి విక్రయదారుల ఆశలో పడి రైతులు గంజాయిని పండించినట్లయితే ప్రభుత్వ పరంగా వచ్చే లబ్ధి చేకూరదని స్పష్టం చేశారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ గంజాయి వినియోగదారులకు కౌన్సెలింగ్ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. మహారాష్ట్రతో సరిహద్దుల్లో రైలు, రోడ్డు మార్గాలలో గంజాయి విక్రయదారులు ప్రయాణిస్తున్నట్లు గుర్తించామని, వాటిని అడ్డుకునేందుకు జిల్లా పోలీసు యంత్రాంగం ప్రత్యేకంగా తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ట్రైని కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియా, అదనపు ఎస్పీ సురేందర్‌రావు, ఉట్నూర్ ఆర్టీఓ జీవకర్, వ్యవసాయ, ఎక్సైజ్, పోలీసు, వివిధ శాఖల, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ రాజర్షిషా

● రోడ్డు ప్రమాదాల ప్రాంతాలను గుర్తించాలి

ఆదిలాబాద్ అర్బన్: రహదారుల భద్రత, మత్తు పదర్థాల నిర్మూల, జిల్లా లెవల్ యాంటి ర్యాగింగ్ కమిటీపై కలెక్టర్ తన చాంబర్‌లో ఎస్పీ గౌస్‌ఆలం, ట్రైనీ కలెక్టర్ అభిగ్యాన్, అదనపు కలెక్టర్ శ్యామలదేవిలతో కలిసి సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించి అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. పాఠశాలలు, కళాశాలలు, ఆసుపత్రిల వద్ద స్పీడ్ బ్రేకర్స్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. వాహనదారులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించాలన్నారు.